క్లుప్తంగా

ఏఈ, లైన్‌మన్‌లపై చర్యలు తీసుకోవాలి



హన్వాడ: మండలంలోని గొండ్యాలలో దళితుల నుంచి బలవంతంగా విద్యుత్తు బిల్లులు వసూలు చేస్తున్న ఏఈ, లైన్‌మన్‌లపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కురుమయ్య, మండల అధ్యక్షుడు మొగులయ్య డిమాండ్ చేశారు. ఎస్ఈ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. పెద్ద మొగులయ్య, హన్మప్ప, పెద్ద రంగయ్య తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



అడ్డాకుల: సంకలమద్దిలో ఇళ్ల మధ్యన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రేషన్ దుకాణం ఎదుట తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో తీగలు కిందికి వేళాడుతున్నాయి. దీనివల్ల ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆడుకుంటూ చిన్న పిల్లలు దగ్గరికి వెళితే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. స్థానికంగా కొందరు పాడి రైతుల వద్ద ఉన్న పశువులు అటు వైపు నుంచి వెళ్లే సమయంలో ఒకరు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉండి వాటిని అక్కడికి వెళ్లకుండా చూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఎలాంటి రక్షణ కంచె ఏర్పాటు చేయలేదని.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతలమయంగా బీటీరోడ్డు



అడ్డాకుల: దాసర్‌పల్లి గ్రామం నుంచి దాని అనుబంధ గ్రామమైన చెన్నంపల్లి వరకు ప్రస్తుతం ఉన్న బీటీరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దాసర్‌పల్లి దాటిన తర్వాత చెరువు కట్టపై చాలా చోట్ల బీటీరోడ్డుపై గుంతలు ఉన్నాయి. ఇక్కడ గుంతల వల్ల వాహనాలు అదుపు తప్పితే చెరువులోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. చెరువు కట్ట తర్వాత చెన్నంపల్లి వరకు రోడ్డుపై కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా మలుపుల వద్ద ఉన్న రోడ్డు గుంతల వల్ల వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఈ రోడ్డుపై చెన్నంపల్లితో పాటు నందిపేట గ్రామస్తులు రాకపోకలు సాగిస్తారు. నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనాలు తిరిగే బీటీరోడ్డు పాడైనందున అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా దుర్గమ్మకు పూజలు



జిల్లాకేంద్రంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు



కొకుంట్లలో అమ్మవారి మహాపడిపూజ



లక్ష్మీపల్లిలో..



దేవరకద్రలో లక్ష్మీదేవిగా వాసవీమాత



జిల్లాకేంద్రం బ్రాహ్మణవాడీలో సంతానలక్ష్మీదేవిగా..



అన్నపూర్ణదేవిగా పర్వతాపూర్ మైసమ్మ

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రాహ్మణవాడీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారిని సంతాన లక్ష్మీదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింహగిరిలోని లక్ష్మీ నరసింహ ఆలయ ప్రాంగణంలో కామేశ్వరీ సమేత ఐశ్వరేశ్వర స్వామి దేవస్థానం, శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం, బస్టాండ్ సమీపంలోని శ్రీద్వారకామయి మందిరంలో, వీరన్నపేటలోని శ్రీచౌడేశ్వరీ ఆలయం, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాసకాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు వనదుర్గాదేవి రూపంలో దర్శనం ఇచ్చారు.

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజు ఒక ప్రత్యేక అలంకరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

గండేడ్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మన్సూర్‌పల్లి తుల్జాభవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రోజుకో రూపంలో అమ్మవారిని అలంకరిస్తున్నారు. మంగళవారం అన్నపూర్ణ దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకుడు రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని గ్రామాల్లో దుర్గామాత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దుర్గామాత మండపాల వద్ద రాత్రివేళ బొడ్డెమ్మలు, కోలాటాలు వేస్తుండటంతో పండగ వాతావరణం నెలకొంది.

దేవరకద్ర: మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం వద్ద మంగళవారం దుర్గామాతను అన్నపూర్ణదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. దళితవాడలోనూ ఘనంగా వేడుకలు జరిగాయి. దేవరకద్రలోని వాసవీమాతను మంగళవారం లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. లక్ష్మీపల్లిలో మంగళవారం గాయత్రీ దేవిగా అమ్మవారికి పూజలు చేశారు. బల్సుపల్లిలోనూ వేడుకలు కొనసాగుతున్నాయి.

జడ్చర్ల టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని వివిధ ఉత్సవ మండపాల్లో అమ్మవారు ఆయా రూపాల్లో దర్శనమిచ్చారు. వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో స్కంధమాతగా, కొన్నిచోట్ల గాయత్రీదేవీ, అన్నపూర్ణదేవీగా దర్శనమిచ్చారు. శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో నాలుగోరోజు చండీహోమం నిర్వహించారు. అన్నదానం చేపట్టారు.

దేవరకద్ర రూరల్: కొకుంట్లలో మంగళవారం దుర్గామాత మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. కుర్వబాలు ఆధ్వర్యంలో అమ్మవారి పడిపూజ కార్యక్రమాలు వేదపండితులు, గురుస్వాముల సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా మాలాధారులు ఆలపించిన భక్తిగీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మన్సూర్‌పల్లి తుల్జభవానీ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దేవరకద్రలో పూజలు చేస్తున్న భక్తులు



జడ్చర్ల శ్రీగిరిక్షేత్రంలో ..



సంకలమద్దిలో..

గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం



భూత్పూర్: మండలంలోని గ్రామాలల్లో ఉన్న సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారం చేస్తామని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ అన్నారు. మంగళవారం హస్నాపూర్‌లో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ, రైతుబంధు మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, ముడా డైరెక్టర్ సత్తూర్ చంద్రశేఖర్ గౌడ్ ఉన్నారు.

నవాబుపేట నుంచి వంద బస్సులు

నవాబుపేట: జడ్చర్లలో బుధవారం జరిగే సీఎం కేసీఆర్ సభకు మండలం నుంచి ప్రత్యేకంగా మహిళలకు వంద బస్సులు ఏర్పాటు చేసినట్లు పార్టీ అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ సభకు మండలం నుంచి 15 వేల మంది తరలుతున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి నిర్ణయం

మహమ్మదాబాద్: ఉమ్మడి గండీడ్ మండలం ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని పాలక మండలి సభ్యులు తీర్మానం చేశారు. ఈ మేరకు మంగళవారం మహబూబ్‌నగర్ డీసీఓకు తీర్మానం కాపీని అందజేశారు. పాలక మండలి సభ్యులు లక్ష్మీనారాయణ, సత్యనారాయణరెడ్డి, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, జంగల్లవెంకట్, చంద్రయ్య, అశోక్‌గౌడ్, దామ్లానాయక్, నర్సప్ప కాపీని అందజేసిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం



కాంగ్రెస్‌లో చేరిన వారితో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 23, 26, 46వ వార్డులకు చెందిన దాదాపు 100 మంది ఇతర పార్టీల కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. నాయకులు వినోద్‌కుమార్, సీజే బెనహర్, బెక్కరి అనిత తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: సీఎం కేసీఆర్ చెప్పినట్లు బంగారు తెలంగాణ రాలేదని.. ప్రజలు సమస్యలతో బాధపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నదర్పల్లిలో ప్రచారం చేపట్టారు. వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

భారీ మెజార్టీ లక్ష్యంగా పనిచేయాలి



నాయకులతో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అన్నాసాగర్‌లో అమిస్తాపూర్‌కు చెందిన పలువురు రజకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. ముడా డైరెక్టర్ సాయిలు, కౌన్సిలర్ రామకృష్ణ , కోఆప్షన్ అజీజ్, నాయకులు పాల్గొన్నారు.

అడ్డాకుల: ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే సతీమణి ఆల మంజుల పిలుపునిచ్చారు. మూసాపేట మండలం స్ఫూర్తితండా, కనకాపూర్ తండా, అడ్డాకుల మండలంలోని తిమ్మాయిపల్లి తండాలో మంగళవారం ఆమె ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఎంపీపీ కళావతి, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మ, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రచారం



మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పథకాలపై పోతన్‌పల్లి గ్రామంలో పార్టీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ గోవింద్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు గ్రామాల్లో అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. శేఖర్‌రెడ్డి, ఖాజా, సత్తన్న, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

నవాబుపేట: కాంగ్రెస్ పథకాలు వరం లాంటివని డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం లింగంపల్లిలో పథకాలపై ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, జిల్లా నాయకులు షబ్బీర్, రాజేష్, మల్లేష్ పాల్గొన్నారు.

పథకాలతో బతుకు గ్యారెంటీ

జడ్చర్ల టౌన్: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ఆరు గ్యారెంటీలతో బతుకు గ్యారెంటీ లభిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 21వవార్డులో గడప గడపకు ఆరు గ్యారెంటీలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరికలు

భూత్పూర్: డీసీసీ అధ్యక్షుడు జి.మధుసుదన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సిద్ధాయిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. మండల మాజీ అధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, నాయకులు ఉన్నారు.

బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా హేమసముద్రం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పాలమూర్-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా హన్వాడ మండలంలో హేమ సముద్రంను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మారుస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఫాంహౌస్‌లో ఇటీవల నూతనంగా ఎన్నికైన మత్స్య సహకార సంఘం నాయకులను మంత్రి అభినందించారు. జిల్లాలోని అన్ని చెరువులను నింపుతామని దీంతో కుల వృత్తులు తిరిగి పూర్వవైభవం సంతరించుకుంటాయన్నారు. మత్స్యకారులకు ఐడీ కార్డులను అందిస్తామని వివరించారు. అదేవిధంగా వివిధపార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.



మంత్రిని కలిసిన హన్వాడ నాయకులు

ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి



గండేడ్‌లో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం



జడ్చర్లలోజాబితా పరిశీలిస్తున్న బీఎల్‌ఓలు

జడ్చర్ల టౌన్: నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తుండటంతో మున్సిపాలిటీ ఓటర్ల జాబితా పరిశీలన మంగళవారంతో పూర్తయ్యింది. మున్సిపాలిటి పరిధిలో జడ్చర్ల, కావేరమ్మపేట, నాగసాల, బూరెడ్డిపల్లి, బాదేపల్లి గ్రామాలున్నాయి. వీటిలో మొత్తం 49 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల వివరాలు పరిశీలించారు. 49మంది బీఎల్‌ఓలు మృతిచెందిన ఓటర్ల పేర్లు తొలగించటంతోపాటు కొత్తగా చేర్చిన వారి వివరాలు తనిఖీ చేశారు. ఒకే ఇంట్లో ఉన్న వారి ఓట్లు ఒకే పోలింగ్ పరిధిలోకి వచ్చేలా మార్పులు చేర్పులు పూర్తిచేశారు. దాదాపు 60ఓట్లు ఇతర పోలింగ్ కేంద్రాల్లో ఉండగా వాటిని ఒకే పోలింగ్‌కేంద్రంలోకి మార్చారు. తప్పిదాలు సైతం సరిచేశారు.

గండేడ్: గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల నియమావళిపై సమావేశం నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించకుండా చూడాలన్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరపకూడదని, చీరల పంపిణీ వంటివి చేపట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సభలు వంటివి నిర్వహిస్తే అనుమతులు ఉన్నాయా లేదా అని పరిశీలించాలని పేర్కొన్నారు. ఎంపీఈఓ శంకర్‌నాయక్, ఆర్ఐ రాఘవేందర్ పాల్గొన్నారు.

ప్రాణ సంకటంగా.. రహదారి విస్తరణ



సంపల్లి సమీపంలో రోడ్డు మధ్య ముళ్ల కంచె



రంగారెడ్డిపల్లి మలుపు వద్ద పరిస్థితి

గండేడ్: జిల్లాలో రహదారుల విస్తరణ ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారుతోంది. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా పనులు చేపట్టడం, ఎక్కడ పడితే అక్కడ గుంతలు తవ్వడంతో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. గాయాల పాలవుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

జాతీయ రహదారులను అనుసంధానం చేసే ప్రక్రియలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని భూత్పూర్ నుంచి కర్ణాటకలోని మన్నెకలి వరకు ఉన్న 192 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు ప్రారంభం అయ్యాయి. మొదటి ప్యాకేజీలో భాగంగా భూత్పూర్ నుంచి దుద్యాల వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా డ్రైయిన్లు, కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది కానీ.. ఆయా చోట్ల అవసరాన్ని బట్టి పది ఫీట్లకు పైగా లోతు వరకు తవ్వుతున్నారు. ఓవైపు కంకర మరోవైపు మట్టి కుప్పలు సైతం ఉంటున్నాయి. వీటితో దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా చర్యలు చేపట్టకపోవడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. పనులు జరిగే చోట సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదు. దీంతో నిత్యం ఎక్కడో దగ్గర ప్రమాదం జరుగుతూనే ఉంది. తూతూ మంత్రంగా సిమెంటు దిమ్మెలకు కట్టెలను అమర్చి వాటికి రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం, కొన్నిచోట్ల ముళ్ల కంచెను వేయడం వంటివి చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎక్కడా సూచికబోర్డులు లేకపోవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. దుమ్ము కూడా ప్రమాదాలకు కారణం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు నెలలుగా ఇలా పలు సమస్యలు వేధిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని.. ఇప్పటికైనా తగు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రాణాలు కోల్పోతున్నా..

కుల్కచర్ల మండలం అంతారం గ్రామానికి చెందిన కుమ్మరి తిరుపతయ్య గత శుక్రవారం పగిడ్యాల్‌లోని తన సోదరి బాలమ్మ ఇంటికి పెద్దల పండుగకు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరాడు. కాగా కొంరెడ్డిపల్లి సమీపంలో కల్వర్టు కోసం పెద్ద గుంత తీసి ఉంచడంతో అక్కడ ఎలాంటి సూచికలు లేకపోవడంతో చీకట్లో గుర్తించలేక ఆ గుంతలో పడి ప్రాణాలు కోల్పోయాడు. ఉదయం స్థానికులు గమనించే వరకు అతడు చనిపోయిన విషయం వెలుగులోకి రాలేదు.

అదే విధంగా కొంరెడ్డిపల్లికి చెందిన రాములు గండేడ్‌కు బైక్‌పై వెళ్తూ కోడంగల్ నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న మోహన్ బైక్‌తో అంచన్‌పల్లి సమీపంలో పనులు జరుగుతున్న చోట రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఘటనలో రాములు తీవ్రంగా గాయపడగా.. మోహన్‌కు కూడా గాయాలపాలయ్యాడు. ఇలా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు.

నరకప్రాయంగా..



రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ప్రయాణం నరకప్రాయంగా ఉంది. పెద్ద పెద్ద గుంతలు తీయడంతో పాటు ఎక్కడ పడితే అక్కడ తవ్వి పెట్టారు. బైక్‌పై వెళ్లాలంటే తల ప్రాణం తోకకు వస్తుంది. గతంలో జానంపల్లి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లడానికి 40 నిమిషాలు పట్టేది. ఇపుడు గంటన్నరకు పైగా పడుతున్నది. కంకర కుప్పలు మట్టి కుప్పలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. దుమ్ము కూడ ఎక్కువగా వస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. – చల్ల కృష్ణయ్య, ఉపాధ్యాయుడు, వెన్నాచేడ్

జాగ్రత్తలు తీసుకుంటాం

రోడ్డు నిర్మాణం సందర్భంగా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు చెప్పాం. అవసరమైన అన్ని చోట్ల సూచికబోర్డులు ఏర్పాటు చేయిస్తున్నాం. ఇంకెక్కడయినా అవసరం ఉంటే సూచికబోర్డులు ఏర్పాటు చేస్తాం. దుమ్ము లేవకుండా నీళ్ల పోయించేలా చర్యలు తీసుకుంటాం. – రమేష్, డీఈ, నేషనల్ హైవే

ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు



భూత్పూర్: పట్టణంలోని మునిరంగస్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో నుంచి మహిళాలు బతుకమ్మలతో వచ్చారు. సంబురాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి మంజుల పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ చంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు.

ఆనంద్‌కు అవార్డు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అబ్దుల్ కలాం లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ ఎంపిక అయ్యారు. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రదానం చేస్తున్న ఈ అవార్డును నవంబర్ 5న హైదరాబాద్‌లో జరగనున్న కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాసరాజు చేతుల మీదుగా అందుకోనున్నారు.